# ఇదొక రకం... ★

రచన:
శ్రీ బి. వి. డి. ప్రసాదరావు.

"వంద" మోహన్.

'వందా!' మురళీకృష్ణ.

'...' మోహన్.

'ఒకే కాగితమా?' మురళీకృష్ణ.

ఆం '...' మోహన్.

* * *

మురళీకృష్ణ: చిరాగ్గా, చిరాగ్గా వుంది. నా మీద నాకే. ఎటూ తేల్చుకోలేక పోతున్నాను.

ఎవరు తీశారు?!... నేటికి వరకూ, ఒక్కసారి కూడా ఇలా జరగలేదు. అందుకే ఆశ్చర్యంగా వుంది. అయోమయంగా వుంది.

ఎవరని అనుమానం పడేది...

లక్ష్మి అంటే-అటువంటిది కాదు. నేటికి తను కాపురానికి వచ్చి పదేళ్ళవుతోంది. తన మనసు నాకు బాగా తెలుసు.

మరి, పని పిల్లంటే అది, నమ్మకస్తురాలే!... కాగా, అది నాగదిలోకి ఎప్పుడూ వెళ్ళదు. నా గదిని శుభ్రపర్చడం లక్ష్మి డ్యూటీ.

మరి...మరి...

సాయి...కుమార్...ఇద్దరు ఆరేళ్ళు, మూడేళ్ళ వాళ్ళు!

చప్పుడయింది. అటు చూశాను.

కుమార్ పరుగున వచ్చి, మంచం కిందకు దూరుతున్నాడు.

నేను ఈజీచైర్ లోకి జారుకున్నాను.

అటే చూస్తున్నాను.

కుమార్ ఆత్రంగా చేతిలో నున్నదేదో తింటున్నాడు.

వాడు తినే విధానం బట్టి; వాడు, తల్లికి తెలియకుండా ఏదో తెచ్చి, తింటున్నాడను కోవచ్చు-లేదా-చిన్నయ్యకు చూపకుండా తిను, అని, లక్ష్మి ఏదో ఇస్తే, వీడిలా తెచ్చుకొని తింటున్నాడను కోవచ్చు...

ఇటువంటివాడు, అంత పెద్ద మొత్తం దొంగిలించే సాహసం చేస్తాడంటే నే నమ్మలేక పోతున్నాను.

'ఏమిట్రా, ఆలోచిస్తున్నావ్?'

మోహన్ ని చూడగానే ఉలిక్కిపడ్డాను. సర్దుకుంటూ కూచున్నాను.

వాడికి కుర్చీ చూపించాను.

'కూచో' నీరసంగా పలికింది నా గొంతు.

వాడూ కూచున్నాడు.

మోహన్ నా క్లాస్ మేట్, ఒకానొప్పుడు.

చాలా రోజులు తర్వాత కల్సుకున్నాం, ఇప్పుడు.

నన్ను చూసి పోదామని వచ్చాడట, ఎలాగో నా అడ్రస్ తెలుసుకొని.

మోహన్ అలా తిరుక్కొని వస్తాన్నాడు.

నన్ను రమ్మన మన్నాడు, వెళ్తున్నప్పుడు.

నాకు బడలికగావుంది రాలేనన్నాను.

నిజమే, నా మనస్సంతా భారంగా వుంది, ఉదయం మోహన్ చెప్పిన ఆ విషయం విన్న దగ్గరనించి.

మోహన్ వస్తూ, వందరూపాయలు కూడా

తెచ్చుకున్నాడట. పర్స్ జేబులో వుంచుకున్నాడట.

వాడి బస నా గదిలోనే ఏర్పాటు చేశాను.

నా బట్టల స్టాండ్ మీదే వాడు బట్టలు విప్పి వేశాడు. నిన్న వచ్చిన వెంటనే-కుశల ప్రశ్నలైన పిమ్మట.

రాత్రి చాలా సేపటి వరకు మాట్లాడుకున్నాం. చాలా విషయాలు గురించి.

ఉదయం బజారుకని బయలుదేరాం.

వాడు బట్టలు వేసుకొని, జేబులో ఎందుకో చెయ్యి పెట్టుకొని, రాతి బొమ్మలా వుండిపోయాడు, కొన్ని క్షణాల వరకు.

నేను కాఫీ తాగుతూ ఇదంతా గమనించాను.

ఆశ్చర్యంగా అడిగాను: 'ఏమిట్రా! ఏం జరిగింది?' అని,

వాడు మౌనంగా కొంత సేపు వూరుకున్నాడు. తర్వాత గబగబా ముందుకు వెళ్ళి, వంగి, బట్టల స్టాండ్ వెనక చూడడం మొదలుపెట్టాడు.

నాలో కుతూహలం పెరుగుతోంది.

అడిగాను.

వాడు వచ్చి, నా ముందు కూర్చున్నాడు కుర్చీలో.

మళ్ళీ అడిగాను.

నెమ్మదిగా చెప్పాడు, కొన్ని క్షణాలాగి.

'జేబులో చిల్లరుంది ... కానీ, మిగిలిన డబ్బు...కనిపించడం లేదు'.

Grams: "SHIVAJITEX" Phone: 23616




T. MARIMUTHU
Handloom Weaving Factory
SELLUR, MADURAI - 625 002.

టి. మారిముత్తు
హేండ్‌లూమ్ వీవింగ్ ఫ్యాక్టరి,
సెల్లూర్ :: మధురై - 625 002.

'ఎంత ?!'

'వంద'

♦ ♦ ♦

ఫోన్ చేసి, వచ్చి వరండాలో కూర్చున్నాం నేను మోహన్, కుర్చీలలో ఎదురెదురుగా.

అప్పుడే అటుగా లక్ష్మి వచ్చింది. వీధి గుమ్మంలో నించుంది. వీధిలోకి చూస్తోంది.

'ఏంటి, లక్ష్మీ! ఏం చూస్తున్నావ్ ?' అడిగాను.

'సాయి, ఇంకా రాలేదండి!' చెప్పింది లక్ష్మి. ఆమెగొంతు దిగులుగా వుంది.

'ఇంకా, అంటే స్కూల్ నుంచే రాలేదా?' అడిగాను.




'ఆఁ. అవునండీ' ఈసారి బొంగురుగా వుంది లక్ష్మి గొంతు.

'కుమార్‌ని పంపించాను, సాయి స్నేహితులింటికి, వాళ్ళంతా వచ్చేశారట. వాళ్ళకి సాయి గురించి తెలియదంటున్నారట!' లక్ష్మి చెప్పింది, ఆపకుండానే.

'వీడి మొహం, వీడు వెళ్ళాడో లేదో?'

'వెళ్ళాడండీ. తోడుగా మన ఎదురింటి గిరిని కూడా పంపానండీ'

అప్పుడే కుమార్ లోనించి వచ్చి, తల్లి చెంతకు చేరుకున్నాడు.

ఏరా! నువ్వు అన్నయ్య కోసం వెళ్ళావా?

'ఆఁ నేను, గిరిన్నయ్య వెళ్ళాం' చెప్పాడు కుమార్.

నే నేదో అనబోతున్నాను, మోహన్ ఏదో చెప్పబోతూంటే, వాడికేసి చూశాను.

'సాయి, నాకు, సినిమా హాలు వద్ద కనిపించాడ్రా. నన్ను చూసి నవ్వాడు కూడా. నేను పిలుస్తుంటే వినిపించుకోకుండా అక్కడ గుంపులో కల్సి పోయాడు'. మోహన్ చెప్పాడు.

వాడు చెప్పింది విన్న తర్వాత, నాతల తిరుగుతున్నట్టుంది.

సాయి మీద ఎందుకో అనుమానం మొగ్గ తోంది.

'ఏ హాలు వద్ద?' అసహనంగా అడిగాను.

'పద్మశ్రీ' చెప్పాడు మోహన్.

నేను యాంత్రికంగా లేచాను, కుర్చీలోంచి.

హాలు వద్దకు వెళ్ళాలనుకుంటూ, నాగది వేపు నడిచాను, బట్టల కోసం.

అప్పుడే లక్ష్మి గొంతు వినిపించింది.

అటు చూశాను.

'ఏంరా, ఎటు వెళ్ళావ్ ?' తీక్షణంగా వుంది లక్ష్మి గొంతు.

బెదురుగా అందరివంకా చూస్తూ, గుమ్మంలోనే వుండి పోయాడు సాయి.

వాడి చూపులు నన్ను కదిలించ లేక పోతున్నాయి.

వాడి మీద ఏదో కసి పెరుగుతోంది, నాలో.

పిలిచాను.

వాడు వచ్చాడు, నెమ్మదిగా.

'ఎటు వెళ్ళావ్ ?' అడిగాను.

వాడు చెప్పలేదు.

కళ్ళంటా ధారగా నీరు కారుస్తున్నాడు.

బహుశా, నా గొంతు వాడిని కలవర పరుస్తోందేమో!

నెమ్మదిగా చెప్పుతున్నాడు, నేను మరో సారి అడిగే సరికి.

'మరి...మరి...మా మాస్టారుగారు బజారుకు తీసుకు వెళ్ళారు'

'ఎందుకు ?!'

'ఊఁ మరి ... మరి ... సామాను సంచులు పట్టుకోడానికి...'

'నిజమా ?'

'ఊఁ కావాలంటే నాతో రాజుకూడా వచ్చాడు. వాడ్నడగండి' వణికి పోతున్నాడు సాయి.

'మరి ఈ మామయ్యా నీకు సినిమా హాలు కనిపించారా ?' మోహన్ ని చూపిస్తూ అడిగాను.

వాడు లేదన్నాడు.

(5)

నాలో వేడి రగులుతోంది.

'సాయీ నిజం చెప్పు. నువ్వు కనిపించ లేదూ ?' మోహన్ అడిగాడు.

వాడు లేదన్నాడు, మళ్ళీ.

'నిజం చెప్పు' అరిచాను.

వాడు అడ్డంగా తలూపాడు.

అంతే___

నేను వాడి జుత్తు పట్టుకొని, నాకు దగ్గరగా లాక్కున్నాను.

'చెప్పు నువ్వు. నువ్వు మామయ్య జేబులో డబ్బుతీసి, ఖర్చుపెట్టి వస్తున్నావ్ కదూ ?... ఏవీ నీ జేబులు...' అంటూ వాడి జేబులు తడిమాను.

వాడి నిక్కరు జేబులో పావలా కనిపించింది.

ఫోన్ నెం: 21886



Saradha
KNITTING MILLS
TIRUPUR-638604.

ఇంతవరకూ వాడికి నే నెప్పుడూ డబ్బులివ్వ లేదు. ఒక వేళ—

'ఏం, లక్ష్మీ! నువ్వు ఇచ్చావా?' అడిగాను, లక్ష్మిని.

'లేదండీ!'

'ఇదెక్కడది?!' సాయి నడిగాను.

'మాస్టారు...మాస్టారు గారు ఇచ్చారు... నన్నూ, రాజును పంచు కోమన్నారు...మేం వద్దన్నా, వుంచుకోండి అన్నారు.. రేపు బడిలో ఏదైనా కొనుక్కుందామని నా దగ్గరే వాడుంచేడు...' బెక్కుతూ చెప్పాడు సాయి.

వాడి మాటలు నాతల కెక్కడం లేదు... వాడేదో అబద్ధం చెప్తున్నాడని పిస్తోంది.

గట్టిగా రెండు, మూడు సార్లడిగాను.

వాడు పాడిందే పాడుతున్నాడు.

నాలో సహనం క్షీణిస్తోంది.

చివరికి కొట్టినా - ఊహుఁ - లాభం లేక పోతుంది.

వాడు గోలగా ఏడుస్తున్నాడు.

లక్ష్మి వచ్చి, అడ్డుపడి, వాడ్ని లాక్కుపోయింది, లోపలికి.

నెలాఖరు రోజులు—

నా దగ్గరకూడా డబ్బు లేదు, అంతగా.

మోహన్ వెళ్ళి పోతానంటున్నాడు.

తన డబ్బు, సాయి తీశాడనే వాడికను మానంలా గుంది, రాత్రి వాడి మాటలు బట్టి చూస్తుంటే

నా కెందుకో తల తీసేసినట్టయింది...

నా దగ్గర పాతిక కంటే ఎక్కువ లేదు.

ఓ నిర్ణయానికి వచ్చిన పిమ్మట - మూడు పాతికలు జత చెయ్యగలిగాను, నలుగురి వద్ద అప్పు చేసి.

◆ ◆ ◆

మోహన్ బస్సు జోరుగా ముందుకు దూసుకు పోతుంది.

కిటికీ ప్రక్క సీటులో కూచున్నాడు కనుక గాలి చల్లగా తగులుతోంది, హాయిగా వుంది.

'ఏదైనా మనసు ఉల్లాసంగా వుంటె, ఏదో ఎంతో హాయిగానే వుంటుంది'—అన్న ఎవరి మాటల్లో నిజం, వాడి కిప్పుడు తెలిసి వస్తోంది.

'ఎక్కడికి, సార్!' కండక్టర్ అడిగాడు.

'పార్వతీ పురం'

వాడు టిక్కెట్టు కోసి ఇచ్చాడు.

మోహన్ డబ్బులు తీసి ఇచ్చాడు.

వాడిచ్చిన చిల్లరను జేబులో వేసుకున్నాడు.

జేబు తడుముకున్నాడు.

జే బెందుకో బరువుగా అనిపిస్తోంది వాడికి.

'ఇది కలిసి వచ్చిన అదృష్టం...' కాదు, కోరి తెచ్చుకున్నది...' మనసులోనే అనుకున్నాడు.

తృప్తిగా వూపిరి పీల్చుకున్నాడు.

'...ఫర్వాలేదు, మరో పది, పదిహేను రోజుల వరకు, నా వాళ్ళని పోషించుకో గలను' అని అనుకుంటున్న, వాడి మనసులో ఓ మూల ఏదో బాధ...ఎందుకో?!

